# ఏసీబీ నోటీసులు ముమ్మాటికీ కక్షసాధింపే

- యథేచ్ఛగా దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- డైవర్షన్ పాలిటిక్స్ అమలుచేస్తున్న రేవంత్
- ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,జూన్13 : ఫార్ములా ఈ కార్ల రేసింగ్ వ్యవహారంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు మరోసారి విచారణకు రావాలని నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్ష సాధింపే తప్ప మరొకటి కాదని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎంఎల్ఎ హరీష్‌రావు ఎక్స్ వేదికగా ఆరోపించారు. తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రేవంత్ రెడ్డి దర్యాప్తు సంస్థలను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారని అనడానికి కెటిఆర్‌కు ఇచ్చిన తాజా నోటీసులే నిదర్శనం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలని నిరంతరం ప్రశ్నిస్తున్న కెటిఆర్ నైతిక స్థయిర్యాన్ని దెబ్బతీసేందుకే రేవంత్ రెడ్డి నోటీసులు పంపించారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 18 నెలల పాలనలో డైవర్షన్ పాలిటిక్స్‌ను అమలు చేస్తూ బిఆర్ఎస్‌ను బద్నామ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా రేవంత్ రాజకీయ అరాచకత్వం గెలిచే ప్రసక్తే లేదని, రేవంత్ రెడ్డి డ్రామా, డైవర్షన్ రాజకీయాలు ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు అర్థమయ్యాయని పేర్కొన్నారు. ఫార్ములా ఈ రేసింగ్‌తో తెలంగాణ ప్రతిష్ట పెరిగిందని, పెట్టుబడులు కూడా వచ్చాయని తెలిపారు. తెలంగాణ ప్రతిష్ట పెంచినందుకా కెటిఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం నోటిసుల ప్రతాపం..? అని ప్రశ్నించారు. 2000లో చంద్రబాబు ఫార్ములా వన్ కోసం కృషిచేసి నిర్వహించలేకపోయారని, అలాంటిది బిఆర్ఎస్ ప్రభుత్వం,కెటిఆర్ కృషి వల్ల ఫార్ములా వన్ వంటి ప్రతిష్టాత్మక రేస్‌ను భారతదేశానికి అందులోనూ హైదరాబాద్‌కి తీసుకొని వచ్చారని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తెలంగాణను మార్చేందుకు ఫార్ములా ఈ రేస్‌ను హైదరాబాద్‌లో నిర్వహించి పెట్టు-బడులను ఆకర్షించారని, అమర్ రాజా వంటి కంపెనీలు పెట్టు-బడి పెట్టేందుకు ముందుకు వచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందాల పోటీలు నిర్వహించి రాష్ట్ర పరువును, దేశ పరువును మంటకలిపిందని మండిపడ్డారు. అందాల పోటీతో లాభం లేదు కానీ రాష్ట్ర పరువు మాత్రం తీశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపినందుకు, రేవంత్ రెడ్డిని విమర్శిస్తున్నందుకు కెటిఆర్‌కి ఎసిబి నోటీసులు ఇచ్చిందని స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఎన్ని రకాలుగా వేధించినా ఆయన వైఫల్యాలను ఎండగట్టడం మాత్రం బిఆర్ఎస్ ఆపదు అని హరీష్‌రావు స్పష్టం చేశారు.

# నగరంలో పలుచోట్ల వర్షం

- చురుకుగా కదులుతున్న రుతుపవనాలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి సూచన

హైదరాబాద్,జూన్13 : నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో వాహనాలపై వెళ్తున్న వాహనదారులు తడిసి ముద్దయ్యారు. నగరంలోని బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్ బాగ్, నాంపల్లి, లిబర్టీ, హిమాయత్ నగర్, నారాయణగూడ, లక్డీకాపుల్, ఖైరతాబాద్, ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై వరద చేరడంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నైరుతి రుతుపవనాలు మరింత విస్తరించడంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి.. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఐదు రోజులపాటు- మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయి. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ విభాగం వెల్లడిరచింది. దక్షిణ, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురవచ్చని.. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపింది. ఇవాళ ఉమ్మడి మహబూబ్‌నగర్, నిజామాబాద్, మెదక్, నల్గొండతో పాటు- వికారాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే వీలుందని తెలిపింది. రుతుపవనాల ప్రభావంతో హైదరాబాద్‌లో పలుచోట్ల వర్షం కురిసింది.ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణ కంటే ఎక్కువ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో గోదావరి కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వీలైనంత వరకు ప్రాణ, ఆస్థి, ఆర్థిక నష్టం జరగకుండా ఇప్పటి నుండే పకడ్బందీ చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతా ల్లో వరద నిర్వహణపై ఆయా జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగిన తర్వాత స్పందించే దానికంటే నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. హైదరాబాద్ తరహాలోనే రాష్ట్ర స్థాయిలో ప్రధానంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలు, విపత్తుల నిర్వహణా విభాగం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా కమిషనర్, అగ్నిమాపక డిజీ, విపత్తుల నిర్వహణ కమిషనర్, కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్, నీటిపారుదల, ఆర్ అండ్ బి, ఆరోగ్య శాఖల కమిషనర్లతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ- వారం రోజుల్లో నివేదిక ఇస్తుందని కమిటీ- నివేదిక ప్రకారం చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు.

### కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

# కక్షసాధింపు చర్య

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్,జూన్13 :

ఫార్ములా-ఈ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేయడాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఖండిరచారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. కాంగ్రెస్ సర్కార్ మళ్లీ నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మీరు ఎన్ని కుట్రలు పన్నినా మీ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగడతాం అని పేర్కొన్నారు. ఫార్ములా ఈ కేసులో ఈనెల 16న విచారణకు రావాలని అవినీతి నిరోధక శా(ఏసీబీ) మరోసారి కేటీ-ఆర్‌కు నోటీ-సులు జారీ చేసింది. మే 26నే ఈ కేసులో విచారణకు హాజరు కావాలని గతంలో ఏసీబీ నోటీ-సులు ఇచ్చింది. విదేశీ పర్యటన షెడ్యూల్ ఉందని.. తిరిగి వచ్చాక హాజరవుతానని కేటీ-ఆర్ సమాధానం ఇచ్చారు. దీంతో తాజాగా ఇప్పుడు విచారణకు హాజరు కావాలని కేటీ-ఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీసులు ఇచ్చింది.

# 16న విచారణకు రండి

- కేటీఆర్‌కు మరోమారు ఏసీబీ నోటీసులు

హైదరాబాద్,జూన్13 :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ మరోమారు నోటీసులు ఇచ్చింది. ఫార్ములా ఈ రేసు కేసుకు సంబంధించి ఈనెల 16న సోమవారం ఉదయం పది గంటలకు విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొంది. అయితే ఈ కేసుకు సంబంధించి గత నెల మే 28న విచారణకు హాజరుకావాల్సిందిగా మే 26వ తేదీన కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు పంపింది. అయితే ఆ సమయంలో కేటీఆర్ అమెరికా పర్యటనలో ఉన్నారు. ఈ నేపథ్యం లో విదేశీ పర్యటన ముగిసిన తర్వాత విచారణకు హాజరువుతానని ఏసీబీకి మాజీ మంత్రి సమాచారం ఇచ్చారు. దానికి అంగీకారం తెలిపిన ఏసీబీ.. తాజాగా మరోసారి కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది.



# సీఎంను కలిసిన ఎస్సీ ఎమ్మెల్యేలు

శెనార్తి మీడియా, హైదరాబాద్

నూతనంగా మంత్రి పదవిని స్వీకరించిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నేతృత్వంలో ఎస్సీ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతోపాటు పలువురు నేతలు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక మంత్రిగా ప్రమాణం చేసిన వాకిటి శ్రీహరి, సీనియర్ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా సీఎంను మర్యాద పూర్వకంగా కలిశారు.

# కోడెల సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

- పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాము
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- తిప్పాపూర్ గోశాలలో 50 జతల కోడెల పంపిణీ

శెనార్తి మీడియా, వేములవాడ:

కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. శుక్రవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్ లోని గోశాలలో కోడెల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలను పరిశీలించి, అర్హులైన రైతులకు 50 జతల కోడెలను 100 జీవాలను అధికారులు రైతులకు పంపిణీ చేశారు. ఇప్పటిదాకా మొత్తం 375 జతలు..750 జీవాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలను కేవలం వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. వాటిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పక్కాగా చూడాలని సూచించారు. వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సంరక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, గోశాల కమిటీ సభ్యులు రాధా కృష్ణ రెడ్డి, పశు వైద్యాధికారులు, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.





# స్వామిజీ వేషంలో మోసాలు

ఐదుగురు అరెస్ట్,
రూ. 15.30 లక్షల నగదు, బంగారం,
3 కార్లు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం

శెనార్తి మీడియా, కరీంనగర్:

స్వామిజీ వేషంలో అమాయకులను మపెట్టి, పూజల పేరుతో డబ్బులు దోచిన ఐదుగురు సభ్యుల ముఠాను కరీం నగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి రూ. 15.30 లక్షల నగదు, 7 తులాల బంగారం, మూడు కార్లు (క్రెటా, బాలెనో, తార్), 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన గజ్జి ప్రవీణ్ అనే వ్యక్తి ఓ ప్రమాదంలో కాలికి గాయం కావడం తో ఇంటికే పరిమితమయ్యాడు. అదే సమయంలో అతని తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా, పది రోజుల క్రితం ఓ స్వామిజీనంటూ ఓ వ్యక్తి అతని పరిచయానికి వచ్చాడు. ఇంటి వద్ద క్వింటాల్ బంగారు కడ్డీ ఉందని, దానిని బయటకు తవ్వి పూజలు చేస్తే ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయని నమ్మబలికాడు. లేక పోతే తండ్రి మరణిస్తాడని బెదిరించి, పూజల పేరుతో విడతల వారీగా రూ. 15.30 లక్షలు వసూలు చేశాడు. తర్వాత పూజా సామాగ్రి పేరుతో కొంత కొనుగోలు చేసి, ఇంటి పక్కన గొయ్యి తవ్వి పసుపు, కుంకుమ చల్లి బంగారం అని నమ్మించి ఒక డబ్బా పెట్టించి మరింత డబ్బు డిమాండ్ చేశారు. తిరస్కరించడంతో కుటుంబాన్ని బెదిరించి, “మీ నాన్నను చంపి పాతిపెడతాం” అంటూ బెదిరింపులకు దిగారు.

**నిందితుల వివరాలు**

ఈర్నాల రాజు (చంద్రగిరి), మిరియాల దుర్గయ్య (అగ్రహారం), పెనుగొండ రాజు (చీర్లవంచ), చల్లా అజయ్ (చీర్లవంచ), ఈర్నాల సతీష్ (చీర్లవంచ). ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి, కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ పర్యవేక్షణలో సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్సైలు సాంబమూర్తి, లక్ష్మారెడ్డిలు సిబ్బందితో కలసి ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం చింతకుంట ఎక్స్‌రోడ్ వద్ద వాహనతనిఖీల్లో ముగ్గురు కార్లలో వెళ్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి నగదు, బంగారం, కార్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేశారు.

**అభినందనలు – హెచ్చరిక:**

ఈ కేసును విజయవంతంగా ఛేదించిన సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్సైలు సాంబమూర్తి, లక్ష్మారెడ్డి లను పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం, రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ అభినందించారు. ఈ సందర్భంగా ఏసీపీ శుభం ప్రకాష్ మాట్లాడుతూ, మూఢనమ్మకాల్ని నమ్మి మోసపోవద్దని, స్వామి వేషాల్లో తిరిగే నకిలీ ముఠాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటువంటి మోసపూరిత ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.


# మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కు సన్మానం

శెనార్తి మీడియా, కరీంనగర్:



కరీంనగర్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారి ప్రఫుల్ దేశాయ్‌ను డిసిసిఐయ్ ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్ శుక్రవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసారు. మున్సిపల్ కార్యాలయంలో పూల్ మొక్కను అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సిరాజ్ హుస్సేన్ మాట్లాడుతూ, ప్రఫుల్ దేశాయ్ నాయకత్వంలో కరీంనగర్ అభివృద్ధి పథంలో వేగంగా ముందుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చక్కటి ప్రణాళికలు, స్పష్టమైన లక్ష్యంతో కమిషనర్ నగరాన్ని రాష్ట్రంలోనే ముందుంచుతారనే నమ్మకం ఉందన్నారు. కరీంనగర్‌ను రాష్ట్రంలో ప్రతిష్మాత్మకంగా నిలబెట్టాలని ఆకాంక్షించారు.

# చిన్నారిని ఆశీర్వదించిన నాయకులు




శెనార్తి మీడియా, గన్నేరువరం:

గన్నేరువరం మండలంలోని చాకలివానిపల్లె పరిధిలోని కూనవానిపల్లెలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూన పుష్ప చంద్రశేఖర్ కుమార్తె రష్మికకు నూతన వస్త్రాలంకరణ వేడుక శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తోట కోటేశ్వర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మ్యాదరి శ్రీనివాస్, మండల విలేకరులు బుర్ర అంజయ్య గౌడ్, బుర్ర కోటేష్ గౌడ్, తేళ్ల రవీందర్ పాల్గొని ఆశీర్వచనాలు అందించారు.

# సిపిఐ నాయకుడిని పరామర్శించిన రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



శెనార్తి మీడియా, కరీంనగర్:

సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు, సింగిల్ విండో డైరెక్టర్ చాడ శ్రీధర్ రెడ్డి కుటుంబానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పరామర్శ తెలిపారు. రేకొండ మాజీ ఎంపీటీసీ, సిపిఐ సీనియర్ నాయకురాలు చాడ శోభ గురువారం అనారోగ్యంతో మృతి చెందడంతో శుక్రవారం కూనంనేని రేకొండకు వచ్చి వారి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – “జనన మరణాలు సహజమైనవే అయినా, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే వారు అరుదు. అలాంటి వారిలో చాడ శోభ ఒకరు. ఎంపీటీసీగా పని చేసిన సమయంలో ప్రజల అభిమానాన్ని పొందారు. ఆమె భర్త ప్రభాకర్ రెడ్డి ఎంపీపీగా పనిచేస్తూ ప్రజా అభివృద్ధికి పాటుపడ్డారు. వారి ఆశయాలను కొనసాగిస్తూ, పార్టీకి సేవలందించిన శోభ మృతి దురదృష్టకరం” అని అన్నారు. ఆమె కుమారుడు శ్రీధర్ రెడ్డి కూడా పార్టీలో జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా, సింగిల్ విండో డైరెక్టర్‌గా ప్రజలకు, పార్టీకి సేవలందిస్తున్నారని అభినందించారు. శోభ మృతి పట్ల పార్టీ రాష్ట్ర కమిటీ తరఫున సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. పరామర్శించినవారిలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, గూడెం లక్ష్మి, బోయిని సర్దార్ వల్లభాయ్ పటేల్, బూడిద సదాశివ, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, తేరాల సత్యనారాయణ, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, మండల నాయకులు కొమురయ్య, నీల వెంకన్న, మొగిలి ఓదెలు, విలాసాగరం అంజయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ ఆలయ రోడ్డు భూ నిర్వాసితులకు పరిహారం పంపిణీ

40 మందికి చెక్కుల అందజేత

శెనార్తి మీడియా, సిరిసిల్ల :

వేములవాడ పట్టణంలో ఆలయ రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో చెక్కులు పంపిణీ చేశారు. వేములవాడ తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్న సందర్భంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులకు జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో రాధాబాయి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కలెక్టరేట్ అధికారులు చెక్కులు పంపిణీ చేశారు. వేములవాడలోని 40 మంది భూ నిర్వాసితులకు ఈ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీవో రాధాబాయి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.